AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

జాతీయ ఓటరు దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి అవార్డు అందుకున్నారు. –అక్షరటుడే, ఇందూరు

కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం.. నిమ్స్‌లో అత్యవసర చికిత్స

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: గంజాయి మురా కారుతో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఆమెను హుటాహుటిన హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన అధికారులు అక్కడ అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

నిజామాబాద్ నగరంలోకి గంజాయిని తీసుకొస్తున్నారనే సమాచారంతో మాధవనగర్ ఎంట్రన్స్ వద్ద రూట్ వాచ్ చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్‌పైకి మురా సభ్యులు కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ సౌమ్య తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. దీంతో నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ స్వప్న ఫిర్యాదుతో ఘటనకు సంబంధించిన నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన సోహెల్, రాహిల్, మతిన్, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నగరంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ యథేచ్ఛగా సరఫరా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే కొన్నిరోజుల క్రితం ఇతర రాష్ట్రం నుంచి జిల్లాలోకి ఎండు గంజాయిని తీసుకొస్తున్న ఇద్దరు మహిళలను, కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ముగ్గురిని సైతం పోలీసులు అదుపు

ముమ్మర ఏర్పాట్లు

రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పారదర్శకంగా ఎలక్షన్లు నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి కౌంటింగ్ వరకు ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎదురయ్యే రద్దీని, గందరగోళాన్ని నివారించేందుకు 'క్లస్టర్' పద్ధతిలో రిటర్నింగ్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది.

- భీమ్‌గల్, అక్షరటుడే

- నామినేషన్ల పర్వంలో భారీ మార్పులు
- ప్రతి మూడు వార్డులకు ఒక 'ఆర్వో'
- జిల్లాలో 48 మంది రిటర్నింగ్ అధికారుల నియామకం

మున్సిపాలిటీ మొత్తానికి గతంలో కమిషనర్ ఒక్కరే రిటర్నింగ్ అధికారిగా ఉండేవారు. దీంతో వందల సంఖ్యలో వచ్చే నామినేషన్లను, అభ్యంతరాలను పరిష్కరించడం కష్టతరంగా మారేది. ఈసారి ప్రతి మూడు వార్డులను ఒక యూనిట్‌గా పరిగణించి రిటర్నింగ్ అధికారిని నియమిస్తున్నారు. దీంతో నామినేషన్ సెంటర్ల వద్ద రద్దీ, అధికారులకు పనిభారం తగ్గనుంది. ఒక్కో అధికారి మూడు వార్డుల నామినేషన్లు, స్క్రూటినీ, గుర్తుల కేటాయింపు ప్రక్రియను మాత్రమే పర్యవేక్షిస్తారు.

సమయం ఆదా

మూడు వార్డులకు ఒక ఆర్వోను నియమించడంతో అభ్యర్థులు గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం తప్పనుంది. తమకు కేటాయించిన ఆర్వో కార్యాలయంలోనే పనులు పూర్తి చేసుకోవచ్చు. మున్సిపల్ కమిషనర్లు ఇప్పుడు 'అదనపు జిల్లా ఎన్నికల అధికారులు'గా వ్యవహరిస్తూ, మొత్తం ఎన్నికల సరళిని, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారు. జిల్లాలో ఒక నగర పాలక సంస్థ, మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి.

గెజిటెడ్ అధికారులకే బాధ్యతలు

కీలకమైన ఈ బాధ్యతల కోసం కలెక్టర్ వివిధ శాఖల నుంచి గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను ఎంపిక చేస్తున్నారు. తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖల గెజిటెడ్ అధికారులను ఆర్వోలుగా నియమించనున్నారు. సాంకేతిక సహాయం అందించడానికి ప్రతి ఆర్వోకు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఇద్దరు క్లర్కులను కేటాయించనున్నారు.

ప్రత్యేక శిక్షణ

ఎంపిక చేసిన అధికారులకు నామినేషన్ల స్వీకరణలో పాటించాల్సిన నియమాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియ, అఫిడవిట్ల పరిశీలన, ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పించనున్నారు. అభ్యర్థుల అర్హతలను సరిచూడడంలో ఆర్వోలదే తుది నిర్ణయం కానుంది.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆర్వోల వివరాలు

మున్సిపాలిటీ	వార్డులు	ఆర్వోలు	ఏఆర్వోలు
నిజామాబాద్	60	20	20
బోధన్	38	13	13
ఆర్మూర్	36	12	12
భీమ్‌గల్	12	04	04

వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో నిలిచిన వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడం సంతోషంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. వంతెన నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించానన్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే అమ్మ వెంచర్ రింగురోడ్డు ప్రాంతాలకు రాకపోకలు సులభమవుతాయని అలాగే భవిష్యత్తులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అభివృద్ధికి కూడా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ న్యాలం రాజు, ఎల్లమ్మ గుట్ట మున్నూరు కాపు సంఘం కమిటీ సభ్యులు, అమ్మ వెంచర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ యత్నం

అక్షరటుడే, బోధన్: ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి నిరసన సెగ తగిలింది. బీఆర్ఎస్ నాయకులు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఘటన ఆదివారం ఉదయం బోధన్ పట్టణంలో చోటు చేసుకుంది. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఎమ్మెల్యే కాన్వాయ్‌కు అడ్డుగా వెళ్తున్న వారిని తప్పించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో అభివృద్ధి చేస్తున్నారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా బోధన్ నియోజకవర్గం కేటాయించలేదన్నారు. కొత్తగా నిధులు తీసుకొచ్చి బోధన్ అభివృద్ధికి కృషి చేయాలని వారు నినదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యాదవ్, మాజీ కౌన్సిలర్ గంగాధర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్వోసీల అందజేత

అక్షరటుడే, భీమ్‌గల్ : ఆపదలో ఉండి వైద్యచికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న ఇద్దరు బాధితులకు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఎల్వోసీలు అందించారు. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం వారు ఎమ్మెల్యేను సంప్రదించగా, ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి ఎల్వోసీలు మంజూరు చేయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుల కుటుంబ సభ్యులకు వీటిని స్వయంగా అందజేశారు. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన తనుష్ గౌడ్ చికిత్స నిమిత్తం రూ. 2,00,000 విలువైన ఎల్వోసీని అందజేశారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఫాతే అహ్మద్ వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష విలువైన ఎల్వోసీని అందజేశారు.

రెండు రోజుల్లో నోటిఫికేషన్ రావొచ్చు: మంత్రి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రెండురోజుల్లో వచ్చే అవకాశం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నగరంలోని వంశీ హోటల్‌లో ఆదివారం నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్, మున్సిపాలిటీల సమీక్షకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు బోధన్, భీమ్‌గల్, ఆర్మూర్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో వారంలో మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 60 డివిజన్లకు గాను కేవలం రెండు డివిజన్లు మాత్రమే కాంగ్రెస్ గెలుపొందిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రెండేళ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వీటిని ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని చెప్పారు.

అన్ని కోణాల్లో సర్వే చేపట్టిన తర్వాతే అనుభవజ్ఞులైన పార్టీ విధేయుడికే టికెట్ దక్కుతాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. టికెట్ రానివారు నిరాశ చెందకుండా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తే భవిష్యత్‌లో వారికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు తీసుకొచ్చాం..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రైతులు, యువత, రైతు కూలీల కుటుంబాల్లో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మన ప్రభుత్వం వెలుగులు నింపుతోందని మంత్రి అన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడలేని విధంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తూ తెలంగాణ ప్రభుత్వం రికార్డులను సృష్టిస్తోందన్నారు.

ప్రతి నాయకుడికి సముచిత స్థానం..

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏ ఒక్క సీనియర్ కార్యకర్తను వదులుకోదని.. సముచిత న్యాయం కల్పిస్తుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పార్టీపరంగా అన్ని సర్వేలు నిర్వహించిన తర్వాతే పార్టీ విధేయుడికే టికెట్‌ను కేటాయించడం జరుగుతుందని, బంధువులకు తెలిసిన వారికి టికెట్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. బీజేపీ ముఖ్య నాయకులు నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. 1931లో అధిక జనాభా ఉన్న నిజామాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడిందని ఇప్పటివరకు స్మార్ట్ సిటీకి నోచుకోలేదన్నారు. మన ముందు 1952లో ఏర్పడిన కరీంనగర్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీగా మారిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు చేశారు. పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శనల నిమిత్తం మైదానాన్ని సిద్ధం చేశారు. అతిథుల కోసం సీటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

బీఆర్ఎస్ హయాంలోనే నగరాభివృద్ధి

అక్షరటుడే, ఇందూరు: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలో నిలిచిపోయిన ఖలీల్‌వాడిలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. బిగాల మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో నగరంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడం ప్రస్తుత ఎమ్మెల్యే అలసత్వంగా భావిస్తున్నామన్నారు. గోడల మీద రాతలు కాదు నగరాన్ని అభివృద్ధి చేసి చూపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంభుని గుడి ప్రాంతంలో దుకాణాల తొలగించాలని పట్టుపట్టిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఇప్పుడు వారి హయాంలో ఎందుకు తొలగించడం లేదో స్పష్టం చేయాలన్నారు. మార్కెట్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్మాణాలు పూర్తయినప్పటికీ వారికి దుకాణాలు ఎందుకు కేటాయించట్లేదో వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్పరాజు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యప్రకాష్, సుజిత్ ఠాకూర్, జగత్ రెడ్డి, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్ షహజాద్, అబ్దుల్ మతిన్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలి

అక్షరటుడే, గాంధారి: బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం అంగడి సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా రోడ్లపై వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కలెక్టరేట్‌లో వృద్ధ ఓటర్లకు సన్మానం..

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి..

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రజలతో ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞలు చేయించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

బాన్సువాడ మండల కేంద్రంలో..

పోతంగల్ మండల కేంద్రంలో..

భీమ్‌గల్ మండల కేంద్రంలో..

భీమ్‌గల్ మండల కేంద్రంలో..

ఆలూర్ మండల కేంద్రంలో..

సాలూర మండల కేంద్రంలో..

గాంధారి మండల కేంద్రంలో ర్యాలీ..

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

అక్షరటుడే, ఆర్మూర్: బీజేపీ ఆలూర్ శాఖ ఆధ్వర్యంలో పీఎం నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆలూర్ మండలం దేగాం గ్రామంలోని బీజేపీ కార్యకర్త బండారు యాదగిరి నివాసంలో కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ తిరుమనపల్లి సుభాష్, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ అరుణ్, గంగామోహన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే లంకలపల్లి కిషన్ రెడ్డి వర్ధంతి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి (లొంకలపల్లి) కిషన్ రెడ్డి వర్ధంతిని ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కిషన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను, గతస్మృతులను స్మరించుకున్నారు. ఆయన మనమధ్య లేకున్నా ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని వారన్నారు. కార్యక్రమంలో గాండ్ల పాపన్న, కడపల గుండన్న, తమ్మలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

అక్షరటుడే, ఇందూరు/ఆర్మూర్: రథసప్తమి వేడుకలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కనుల పండువగా జరుపుకున్నారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో జాతర వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి తల్లి గోరి గద్దె వరకు రథాన్ని ఊరేగించారు. నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని సిద్దుల గుట్ట రామాలయం, శివాలయంతో పాటు, జెండా బాలాజీ, కుక్కల గుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయం, విశాఖ కాలనీలోని రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్మూర్‌లో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత వినయ్‌రెడ్డి

నిజామాబాద్ నగరంలో రథసప్తమి వేడుకలు..

నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల క్షేత్రంలో..

పెర్కిట్ పాఠశాలలో స్వచ్ఛ భారత్

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని పెర్కిట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలు, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు దోండి లక్ష్మణ్, రాజ్‌కుమార్, జీవీఆర్ చారి, పోచన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, వేద జీడీ రాజ్‌కుమార్, చోల రాకేష్, నరేందర్, కృషివర్ధన్, పోశెట్టి పాల్గొన్నారు.

గంగాజలాలతో దేవతా మూర్తులకు జలాభిషేకం

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో దేగాం నుంచి గంగాజలాలను తీసుకుని వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. అలాగే డప్పు వాయిద్యాలతో మంగళ హారతులతో ఊరేగింపుగా గ్రామంలోని అన్ని దేవాలయాల్లోనూ విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు మగ్గిడి సూర్య మాట్లాడుతూ.. గ్రామంలో బాగా వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ ప్రతి ఏడాది రెండుసార్లు గంగనీటితో జలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర విజయ్, వీడీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: అదనపు డీసీపీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్వాగార్డెన్‌లో రథసప్తమి సందర్భంగా 108 సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై యోగాసనాలు వేశారు. ముందుగా శ్లోకాలు పఠించిన తర్వాత 108 సూర్య నమస్కారాలు చేసి ఆ సూర్య భగవానుడికి సమర్పించారు. అనంతరం బస్వారెడ్డి మాట్లాడుతూ.. యోగా చేసేవారికి అనారోగ్యాలు దూరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎక్కండ ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు యోగా రాంచందర్, సలహాదారులు జిలకర కిషన్, కార్యదర్శి బాల్ శేఖర్, కోశాధికారి భూమా గౌడ్, సంయుక్త కార్యదర్శి సంగీత, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, పతంజలి ప్రతినిధులు సాయన్న, బుచ్చన్న పాల్గొన్నారు.



పాలెపు రాజును పరామర్శించిన కేంద్రమంత్రి

అక్షరటుడే, ఆర్మూర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలెపు రాజు అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లారు. అతడిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

అభివృద్ధిని పక్కన పెట్టిన ఎమ్మెల్యేను నిలదీయాలి

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపిస్తే పట్టణ అభివృద్ధిని ఎమ్మెల్యే పూర్తిగా పక్కన పెట్టేశారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం సుమారు రూ.2.5 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణంతో పాటు, అమృత్ పథకం కింద తాగునీటి పైపులైన్ల విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధిపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారన్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కంటే రాజకీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధిగా అందరినీ సమదృష్టితో చూడాల్సింది పోయి కేవలం ప్రోటోకాల్ కులాలు, మతాలకు మాత్రమే ప్రాధాన్యమిస్తూ వర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సమాజంలో సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం ఒక ఎమ్మెల్యేకు తగదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కామారెడ్డి పట్టణ అభివృద్ధికి అర్ధ రూపాయి కూడా ఎమ్మెల్యే తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. చేసిన పనులు, సాధించిన అభివృద్ధిని చూయించి ఓట్లు అడగాలి తప్ప, అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు ఆయన డ్రామాలను గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మాజీ వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అక్షరటుడే, ఆర్మూర్: పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ వివరాలు వెల్లడించారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సై గోవింద్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఆ ప్రాంతంలో జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలియజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.54వేల నగదు, 10 సెల్ ఫోన్లు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నామని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాటస్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: పేకాటస్థావరంపై సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సీసీఎస్ ఇన్ ఛార్జి ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగో పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్నట్లుగా పక్కా సమాచారం మేరకు తిరుమల టాకీస్ రోడ్డులోని ఓ ఇంటిపై ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సై గోవింద్ తన సిబ్బందితో దాడులు చేశారు. ఈ సందర్భంగా నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,350 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు నిమిత్తం నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.